# అంతరంగయాత్ర

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA DECEMBER 2014 - MARCH 2015 Rs. 2/- VOL. IX ISSUE 2

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ


## వివాహాలు, మరణాలు, చిన్నపిల్లల నవ్వులు, వెక్కి వెక్కి ఏడుస్తున్న ధ్వనులు - సమస్తమూ ఆ బాటపైన...

వర్ష ఋతువు ప్రవేశించింది. భారంగా పైన తిరుగుతున్న దట్టమైన వానమబ్బుల వల్ల సముద్రం దాదాపు నలుపు రంగులోకి తిరిగిపోయింది. కొద్ది రోజులు ధారాపాతంగా వర్షాలు కురుస్తాయి. ఒకటి రెండు రోజులు ఆగిపోతాయి. మళ్ళీ మొదలు. ప్రతి నీటి మడుగులోను కప్పలు బెక-బెక లాడుతుంటాయి. వర్షాలు తీసుకొచ్చిన పరిమళంతో వాతావరణం నిండి-పోతుంది. నేల అంతా మళ్ళీ పూర్తిగా శుభ్రపడుతుంది. మరి కొద్ది రోజుల్లోనే కళ్ళు చెదిరిపోయేంత పచ్చగా తయారవుతుంది. మన కళ్ళ ముందే అన్నీ మొలకెత్తి పెరుగుతుంటాయి. సూర్యుడు బయట పడీపడగానే భూమి మీద వున్న సమస్తమూ తళతళా మెరిసి-పోతుంటాయి. ప్రాతః కాలంలో మంత్రోచ్ఛారణ వినబడు తుంటుంది. చిన్న చిన్న ఉడుతలు అంతటా తిరుగుతుంటాయి. ఎక్కడ చూసినా పూవులు. అడవి పూలూ, తోటల్లో పెంచిన పూలూ, మల్లెలు, గులాబులు, బంతిపూలూ.

సముద్రం వైపుగా దారితీసే త్రోవలో తాళవృక్షాల, బరువుగా వంగిన శిరీష వృక్షాల నీడన నడుస్తూ వందల, వేల సంగతులను పరికిస్తూ పోతుంటే పాటలు పాడుతున్న చిన్నపిల్లల బృందం ఒకటి కనబడింది. వాళ్ళు ఎంతో సంతోషంగా వున్నారు. ప్రపంచం గురించి వారికి బొత్తిగా ఏమీ తెలియదు. అవేవీ పట్టించుకోకుండా వారు అమాయకంగా వున్నారు. ఆ పిల్లలలో ఒకరు నన్ను గుర్తించారు. చిరునవ్వుతో నా వద్దకు రాగా మేమిద్దరం చేయీ చేయీ కలిపి కొంతసేపటి వరకు నడిచాం. మా ఇద్దరిలో ఎవ్వరమూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ అమ్మాయి ఇంటి సమీపంలోకి రాగానే ఆ చిన్నపిల్ల నాకు అభివాదం చేసి ఇంటి లోపలకు వెళ్ళిపోయింది. ఈ ప్రపంచమూ ఆమె కుటుంబమూ ముందు ముందు ఆమెను ధ్వంసం చేసి వేస్తాయి. ఆమె పెద్దదై సంతానాన్ని కూడా కంటుంది. ఆ పిల్లల గురించి దుఃఖిస్తుంది. ఈ ప్రపంచపు జిత్తులమారి తీరు తెన్నులు ఆ పిల్లల వినాశనాన్ని కూడా కొని తెస్తాయి. అయితే ఆ సాయంత్రం వేళ మాత్రం ఆ అమ్మాయి చాలా సంతోషంగా ఉన్నది. తన సంతోషాన్ని మరొకరితో పంచుకోవాలనే ఉత్సాహంతో తన చేతిలో మరొకరి చేయి పట్టుకొని నడిచింది.

వర్షాలు వెనుకబట్టాక, ఒక నాటి సంధ్యా సమయంలో ఆ దారినే నడుస్తున్నాను. పశ్చిమాకాశం స్వర్ణ-కాంతులు ప్రసరిస్తున్నది. అప్పుడు చూశాను ఒక యువకుడు అగ్నిహోత్రం వున్న మట్టిపిడతను పట్టుకొని వెళుతూ వుండటం. నడుముకు కట్టుకున్న చిన్న శుభ్రమైన వస్త్రం ఒక్కటి తప్ప అతడి శరీరం నిరాచ్ఛాదంగా వున్నది. ఒక శవాన్ని మోసుకుంటూ ఇద్దరు మనుష్యులు అతడి వెనకే వస్తున్నారు. వారందరూ బ్రాహ్మణులు. అప్పుడే స్నానం చేసి శుభ్రంగా వున్నారు. నిటారుగా వున్న దేహాలతో హుందాగా నడుస్తున్నారు. నిప్పు పిడతతో నడుస్తున్న యువకుడు చనిపోయిన వ్యక్తి కొడుకై వుంటాడు. వారందరూ చాలా వడివడిగా నడుస్తున్నారు. ఊరికి దూరంగా వున్న ఇసుక తీరాలపై ఎక్కడో ఆ శవాన్ని దహనం చేయబోతున్నారు. అలంక-రించిన శవపేటిక, పూలు వెదజల్లడం, దుఃఖిస్తున్న బంధు మిత్ర పరివారం ఖరీదైన కార్లలో వెనక రావడం మొదలైన తతంగాలతో నడిచే శవయాత్రల లాగా లేకుండా, ఆ గాఢతమస్సులా కాకుండా ఇది ఎంతో సామాన్యంగా వున్నది. ఒక్కొక్కసారి శవాన్ని చక్కగా కప్పి, సైకిలు వెనకాల కట్టి తీసుకెళ్ళడం కూడా జరుగుతుంటుంది. అలా తీసుకెళ్ళి శవాన్ని పవిత్ర గంగానది ఒడ్డున దహనం చేస్తారు.

మృత్యువు అంతటా వున్నది. మృత్యువుతో కలసి జీవించడం మాత్రం చేయలేక పోతున్నాం. మరణాన్ని ఒక భయంకరమైన అంధకారంలా చిత్రించుకొని, దాని నుండి ఎలాగైనా తప్పించుకోవాలని చూస్తాం. దానిని గురించి మాట్లాడటం కూడా నిషేధిస్తాం. తలుపులు మూసి వుంచుకొని మరణాన్ని ఆపగలమను-కుంటాం. అయితే అది ఎప్పుడూ ఇక్కడే వుంటుంది. ప్రేమలో వున్న సౌందర్యమే మరణం. మనకు ఆ రెండూ తెలియవు.

మరణం అంటే బాధ అనీ, ప్రేమ అంటే సుఖమనీ, ఆ రెండూ ఏనాటికీ ఒక్కటవవు అనీ అంటాం. ఆ విభజనే బాధ, ఆవేదన. మొట్టమొదటి నుండీ ఇలాగే వున్నది. విభజనా, అంతులేని సంఘర్షణా. పరిశీలకుడే పరిశీలితము అనీ, అనుభవమే అనుభోక్త అనీ చూడలేని వారికి నిరంతరం మరణమే. మానవుడు తన లౌకిక వస్తు సంపదను, తన అతిశయాలను, తన బాధలను, తన జ్ఞానాన్ని మోసుకుంటూ ఈ మహా విస్తృతమైన నదీప్రవాహంలో చిక్కుకొని పోయాడు. తను సేకరించి దాచుకున్న వీటన్నింటినీ నదిలోనే వదిలి, ఈదుకొని తీరాన్ని చేరుతే తప్ప, మరణం సతతం అతడి ద్వారం వద్ద అతడిని గమనిస్తూ, అతడి కోసం వేచి చూస్తూ వుంటుంది. నదిని వదిలివేశారంటే ఇక తీరం అనేదే వుండదు. ఒడ్డు అనేది ఒక మాట. అదే పరిశీలకుడు. అతడు అన్నింటినీ వదిలేయాలి. నదిని, తీరాన్నీ. ఎందుకంటే నదే కాలం. తీరాలు కాలం గురించిన ఆలోచనలు. నది అంటే

కాలప్రవాహం. ఆలోచన అందులోనిదే. పరిశీలకుడు తాను ఏమిటో దానిని, దానంతటినీ వదలివేసినప్పుడు, అప్పుడు పరిశీలకుడు వుండడు. ఇది మరణం కాదు. ఇది కాలరహితమైనది. ఇది మీరు తెలుసుకోలేనిది. ఎందుకంటే తెలుసుకున్నది అంతా కాలానికి చెందినది. కాలరహితమైనదానిని మీరు అనుభవం చెందలేరు. గుర్తింపు కాలంతో కూడుకున్నది. తెలుసుకున్నదాని నుండి విముక్తే కాలం నుండి విముక్తి అవుతుంది.

అమరత్వం అంటే మీరు కల్పించుకున్న ఆ మాట కాదు. ఆ గ్రంథం కాదు. ఆ మనోచిత్రం కాదు. 'ఆత్మ' అనేది, 'నేను' అనేది ఆ స్వీయాత్మ అనే ఆలోచనకు పుట్టిన శిశువు. అదే కాలం. కాలం లేనప్పుడు మరణమూ వుండదు. ప్రేమ వుంటుంది.

పశ్చిమాకాశంలోని రంగులు మాయ మయ్యాయి. భూమ్యా కాశాల అంచుల్లో ఎక్కడో చంద్రరేఖ (సినీవాలి) లేతలేతగా, కోమలంగా, సిగ్గుపడుతూ ప్రత్యక్షమైంది. బాటపైన అన్నీ నడచి వెళ్తున్నాయి. వివాహాలు, మరణాలు, చిన్న పిల్లల నవ్వులు, వెక్కివెక్కి ఏడుస్తున్న ధ్వనులూ - సమస్తమూ. చంద్రుని పక్కన ఒకే ఒక నక్షత్రం.

(సెప్టెంబరు 19, 1973;
'కృష్ణమూర్తిస్ జర్నల్' నుండి)

# హృదయమూ మనసూ

**ఒకరి ప్రశ్న :** మనిషి ఎందుకు తను అనే ఈ జీవిని మేధ, మనోద్వేగాలు అనే రెండు వేరు వేరు అరల్లోకి విభజించు-కున్నాడు? ఇవి రెండూ వేటికవి స్వతంత్రంగా వున్నట్లు అనిపిస్తుంది. జీవితాన్ని నడిపించే చోదకశక్తుల్లాంటి ఈ రెండూ తరచు మహా పరస్పర విరుద్ధంగా వర్తిస్తుంటాయి. ఎంతగా అంటే ఒక్కొక్కప్పుడు మన అస్తిత్వాన్నే ముక్కలుగా చీల్చి విసిరేస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఈ రెండింటినీ ఒక చోటకు చేర్చినప్పుడే మనిషి ఒక సంపూర్ణ జీవి వలె ప్రవర్తించ-గలుగుతాడు. కాబట్టి రెండింటి ఐక్యత సాధించడమే మానవజీవితపు లక్ష్యంగా అయిపోయింది. మనిషి లోపల ప్రధానంగా వున్న ఈ రెండింటికి తోడు మరొక అంశం కూడా వున్నది. అదేమిటంటే మారిపోతూ వుండే పరిసర వాతావరణం. అందుచేత మనిషి లోపలగా వున్న, పరస్పరం విరోధించుకునే ఈ రెండూ మనిషికి బాహ్యంగా వున్నట్లనిపిస్తున్న ఆ మూడవ అంశాన్ని వ్యతిరేకిస్తుంటాయి. ఇది ఒక పెద్ద సమస్య అయిపోయింది. ఇది ఎంత గందరగోళాన్ని, ఎంత పరస్పర వైరుధ్యాన్ని సృష్టించి, ఎంత అలవి కాకుండా పోయిందంటే, వీటన్నింటిని కలిపి వుంచడానికి దేవుడు అనే ఒక బాహిర అంశాన్ని కల్పన చేయవలసి వచ్చింది. ఈ వ్యవహారం అంతా ఇలా ఇంకా క్లిష్టపడిపోయింది. జీవితంలో వున్న ఒకే ఒక ముఖ్య సమస్య ఇదే.

**కృష్ణమూర్తి :** మీ మాటల ప్రవాహంలో పడి మీరే కొట్టుకుపోతున్నట్లుగా అనిపిస్తున్నది. నిజంగానే ఇది మీకో సమస్య అయిందా లేక ఒక మంచి చర్చకు ఇది అనువుగా వుంటుందని దీనిని మీరు కల్పించారా? కేవలం చర్చ కోసమే కనుక అయితే దీనిలో నిజమైన సారం ఏమీ లేనట్లే. ఇది నిజంగా ఒక సమస్యే కనుక అయితే దీనిలోకి మనం లోతుగా వెళ్ళి చూడవచ్చు. ఇక్కడ వున్నది చాలా సంకీర్ణమైన పరిస్థితి. అంతర్గతంగా తనను తాను వేర్వేరు అరలుగా విభజించుకుంటూ, అది మళ్ళీ తన పరిసరవాతావరణం నుండి తనను తాను విడదీసుకోవడం. అంతేకాకుండా, పరిసర వాతావరణానికి సమాజం అనే ఒక పేరు పెడుతున్నది. ఆ సమాజాన్ని వర్గాలుగా, జాతులుగా, ఆర్థిక స్థాయిపై ఆధారపడిన సమూహాలుగా, రకరకాల దేశాలుగా, భౌగోళిక ప్రాంతాలుగా విడదీస్తున్నది. ప్రపంచంలో ప్రస్తుతం వాస్తవంగా జరుగుతున్నది ఇదే అని

## కోరిక ఇంద్రియ సంచలనం కదూ?

కోరిక ఇంద్రియ సంచలనం కదూ? అంటే గ్రహణేంద్రియాలు జరిపే కార్యకలాపానికి ఆలోచన తోడవుతుంది. ఇంద్రియాలు చేస్తున్న పనీ, ఆలోచనా కలిస్తే కోరిక అవుతుంది. ఇది వాస్తవమా లేక ఒక ఊహా ప్రకటనా? దేని వైపు అయినా సరే మీ సమస్త గ్రహణేంద్రియాలతోను సంపూర్ణంగా చూడగలరా? ఆ పరికింపులోనే దానిని ముగించి వేయగలరా? అలా ముగించి, ఇంద్రియాలు జరుపుతున్న కార్యకలాపంలో ఆలోచన ప్రవేశించకుండా చేయగలరా? అంటే ఏమిటంటే, వృక్షాలను, పర్వతాలను, ఒక మనిషి ముఖాన్ని, నిరంతర చలనంలో వున్న సముద్రాన్ని మీరు చూస్తున్నప్పుడు, మీ సమస్త ఇంద్రియాలతో, మీ కనులు, మీ చెవులు, నరాలు - నాడులూ అన్నింటితోనూ చూస్తున్నప్పుడు, వాటిని సంపూర్తిగా చూడగలరా? ఆలోచనను రానివ్వకుండా, ఆ చూపులో ఆలోచనను జోక్యం చేసుకోనివ్వకుండా వుండగలరా? అప్పుడు మీ దృష్టి గ్రాహ్యత పరిపూర్ణంగా వుంటుంది. ఆ పరిగ్రాహ్యతలో ఆలోచన జోక్యం చేసుకున్నప్పుడు ఆ దృష్టి విచ్ఛిన్నం అవుతుంది. ముక్కలుగా విభజిత మవుతుంది. అందుచేత కోరిక విచ్ఛేదిత శకలం.

(ఓహాయి : 17 ఏప్రిల్ 1976 )




మనం అందరమూ గడుపుతున్న జీవితాన్ని చూస్తుంటే ఏకాంతం దాదాపుగా లేనేలేదని చెప్పుకోవచ్చు. మనం ఒంటరిగా వున్నప్పుడు కూడా అనేకమైన ప్రభావాలు, బోలెడంత జ్ఞానవిజ్ఞానాలు మన జీవితాల్లో క్రిక్కిరిసి పోయి వుంటాయి. అసంఖ్యాకమైన అనుభవాల అసంఖ్యాకమైన జ్ఞాపకాలు, విపరీతమైన ఆందోళనలు, వ్యధలు, సంఘర్షణలు చుట్టుముట్టి మన మనసులను ఇంకా ఇంకా మందకొడిగా, ఇంకా ఇంకా సున్నితశీలరహితంగా తయారు- చేస్తుంటాయి. మనసు ఒక గాడిలో పడి ఎప్పుడూ ఒకే మాదిరిగా పని చేస్తూ వుంటుంది. మనం ఎప్పుడైనా ఒంటరిగా వుంటామా? లేదూ ఎప్పుడూ నిన్నమొన్నల భారాలను మోసుకుంటూ బ్రతుకుతుంటామా?

మనం చేస్తున్నది అదే. నిరంతరం మన భారాలను మోసుకొని తిరుగుతుంటాం. వాటికి ఏ నాటికీ చనిపోము. ఆ భారాలను మన వెనకాల వదిలిపెట్టి వేయం. ఒక సమస్యకు మన సంపూర్ణమైన సావధానతను ఇచ్చి, ఆ సమస్యను తక్షణమే పరిష్కరించినప్పుడు మాత్రమే - మరునాటికి, మరుక్షణానికి ఆ సమస్యను మోసుకొని పోకుండా - పరిష్కరించినప్పుడు మాత్రమే ఏకాంతం వుంటుంది. అటువంటప్పుడు మీరు క్రిక్కిరిసి పోయి వున్న ఇంట్లో నివసిస్తున్నా, బస్సులో ప్రయాణిస్తున్నా మనకు ఏకాంతం వుంటుంది. ఆ ఏకాంతం ఒక సరికొత్త మనసును, ఒక అమాయకమైన, నిష్కల్మషమైన మనసును సూచిస్తుంది.

(ఫ్రీడంఫ్రమ్ ది మైండ్ ' నుండి)

అనిపిస్తున్నది. దీనినే జీవితం అని మనం అంటున్నాం. ఇక ఈ సమస్యను పరిష్కరించుకోలేక పరమాత్మ అనే అంశం మన లోలోపల, మన అందరి మధ్యా కూడా సామరస్యతను, అందరినీ కలిపి కట్టివుంచగల సంయోగతను తీసుకొస్తుందని ఆశిస్తూ వుంటాం. ఈ సంయోగ గుణాన్ని మనం మతం అని అంటున్నాం. అయితే ఈ మతమే మళ్ళీ ఇంకొక విభజనకు కారణాంశాన్ని తీసుకొస్తున్నది. ఇప్పుడు మన ముందుకు వచ్చిన ప్రశ్న ఏమిటంటే: ఒక పరిపూర్ణమైన జీవన-సామరస్యతను తీసుకొని రాగలిగినది ఏమిటి? అక్కడ ఏ విభజనలూ వుండవు. ఆ స్థితిలో మేధ, హృదయము రెండూ ఒక పూర్ణజీవి యొక్క సమస్త అస్తిత్వపు అభివ్యక్తి అయి వుంటాయి. ఆ జీవి ఒక శకలం కాదు.

**ప్రశ్నిస్తున్నవారు** : నేను మీతో ఏకీ- భవిస్తున్నాను. ఇది ఎలా జరుగుతుంది? మానవుడు చిరకాలంగా తపిస్తున్నది దీని కోసమే కదా! రకరకాల మతాలను, రాజకీయపరమైన, సామాజిక-పరమైన ఆదర్శలోకాల కల్పనను మానవుడు స్థాపించుకున్నది ఇందుకోసమేగా?

**కృష్ణమూర్తి** : ఎలా అని మీరు అడుగుతున్నారు. ఈ 'ఎలా' యే అన్నింటికంటె పెద్దపొరబాటు. విడదీసే అంశమే అది. మీకు ఒక 'ఎలా' వుంటుంది. మరొకరి 'ఎలా' వారికీ వుంటుంది. అందుచేత ఆ మాట వుపయోగించకుండా వుంటేనే మనం నిజంగా విచారణ చేయగలుగుతాం. అప్పుడే నిర్ణీత ఫలితాన్ని సాధించడం కోసం ఒక పద్ధతి కావాలని వెతకం. కాబట్టి ఒక ఫలితము, అది అందుకునే ఒక విధానము అనే ఆ భావాలను పూర్తిగా అవతలకు నెట్టేయగలరా? ఫలానా ఫలితము అని మీరు నిర్వచించగలిగినప్పుడు ఆ ఫలితం అప్పటికే మీకు తెలిసిన అంశం అనమాట. అందుచేత అది నిబద్ధితమైనది. కాబట్టి అది స్వతంత్రమైనది కాదు. తయారు చేసే విధానాలను కనుక మనం పక్కకు తొలగిస్తే అప్పుడు మన ఇద్దరమూ కలసి విచారణ చేయడం సాధ్యమవుతుంది. సామరస్యత, సమశ్రుతి కలిగిన ఒక పరిపూర్ణ తత్వపు ఉనికి సంభవ- మవుతుందా అనే విచారణ చేయ- గలుగుతాం. అంటే బాహిరంగా వుండే ఒక అంశాన్ని కల్పించకుండా ఇది జరగాలి. ఎందుకంటే బాహిరంగా వుండే అంశాలు ఏవైనా సరే, అవి పరిసర- వాతావరణానికి చెందినవైనా, లేక పరిసరాలకు అతీతమైనవి అయినా అవి అన్నీ సమస్యను పెంచుతాయి. మొట్ట మొదటగా చూడవలసినది ఏమిటంటే భావోద్వేగాలు, మేధ, పరిసర- వాతావరణం అనే ఈ విభాగాలుగా తనను తాను విభజించుకుంటున్నది మనసే. బాహిరమైన ఒక అంశాన్ని ఊహాకల్పన చేసుకున్నది మనసే. సమస్యను సృష్టించినది మనసే.

**ప్రశ్న** : ఈ విభజన వున్నది మనసులో మాత్రమే కాదు. భావోద్వేగాలలో ఇది ఇంకా బలంగా వుంటుంది. ముస్లిములు, హిందువులు తాము వేరువేరు అని అనుకోవడం ఒక ఆలోచనగా కాదు. తాము వేరువేరు అని వారు ఉద్వేగ- పూరితంగా భావిస్తున్నారు. ఈ భావోద్వేగం వారిని నిజంగానే వేరు- పరుస్తున్నది. ఒకరినొకరు హతమార్చు కునేటట్లు చేస్తున్నది.

**కృష్ణమూర్తి** : జరుగుతున్నది సరిగ్గా అదే. ఆలోచనలు, భావోద్వేగాలు రెండూ ఒకటే. ఆరంభం నుండీ అవి రెండూ ఒకటే. నేను చెప్తున్నది కూడా సరిగ్గా ఇదే. అందుచేత మన సమస్య విభిన్నంగా వున్న శకలాలను సమైక్యం చేయడం కాదు. సమస్య మనోహృదయాలను అవగాహన చేసుకోవడం. అసలు అవి రెండూ ఒకటే. మన సమస్య ఈ వర్గ భేదాలను ఎలా పోగొట్టడం అని కాదు. భూలోకం మీద ఆదర్శలోకాలను ఎలా నిర్మించడమన్నది కాదు. ఇంతకంటే మెరుగైన రాజకీయ నాయకులను, ఇంతకంటె ఉత్తములైన మతాచార్యులను ఎలా తయారు- చేసుకోవడం అనేదీ కాదు. మన సమస్య మనసే. ఇక్కడి వరకు వచ్చామంటే- మాటలూ చర్చల ద్వారా కాదు- ప్రత్యక్షంగా చూసి గ్రహిస్తే కనుక అత్యుత్తమమైన తెలివితేటలు వున్నట్లే.

అప్పుడిక మీరు ఏ వర్గానికి గాని ఏ మతవ్యవస్థకు కాని చెందరు. అప్పుడు మీరు హిందువూ కాదు. ముస్లిమూ కాదు. క్రైస్తవులూ కాదు, యాదులూ కాదు. ఇక ఇప్పుడున్నది ఒకే ఒక ప్రశ్న అది ఏమిటంటే, మానవుడి మనసు ఎందుకు విభజిస్తూ వుంటుంది? మనసు తను జరుపుతున్న క్రియలను ఆలోచనలు అనీ, భావోద్వేగాలు అనీ విభజించడమే కాకుండా తనను తాను 'నేను' - 'మీరు' అనీ, 'మనము' - 'వాళ్ళు' అనీ విడదీసి వేరుపరుస్తూ వుంటుంది. మనసూ హృదయమూ రెండూ ఒకటే. ఇది మనం మరవకూడదు. 'మనసు' అనే మాటను మనం ఉపయోగిస్తున్నప్పుడు ఈ సంగతి గుర్తుంచుకోండి. అందుచేత మన సమస్య ఏమిటంటే, మనసు ఎందుకని విభజన చేస్తూ వుంటుంది?

**ప్రశ్న:** అవును.

**కృష్ణమూర్తి :** మనసే ఆలోచన, ఆలోచన చేసే కార్యకలాపం అంతా వేరుపరచడమూ, ముక్కలుగా విడదీయడమూ. ఆలోచన స్మృతుల ప్రతిస్పందన. స్మృతులు అంటే మెదడు. ఒక అపాయాన్ని చూసినప్పుడు మెదడు తప్పక ప్రతిస్పందన చూపాలి. తెలివి అంటే ఇదే. అయితే విభజనలో వున్న అపాయాన్ని ఎందుకనో గాని అలా చూడకుండా మెదడు నిబద్ధించబడింది. వాస్తవాలతో వ్యవహరిస్తున్నప్పుడు మెదడు తీసుకుంటున్న చర్యలు సమంజసమైనవి. అవి అవసరం కూడా. అలాగే విభజన, విచ్ఛిన్నత అపాయకరమైనవి అనే నిజాన్ని మెదడు చూసినప్పుడు అది చర్య తీసుకుంటుంది. ఇది ఒక ఊహా-ప్రతిపాదన కాదు. సిద్ధాంత సూత్రమూ కాదు. అవన్నీ వట్టి బుద్ధిమాలిన ఆలోచనలు. వీటికి వేరుపరచి విడదీసే గుణం వుంటుంది. ఇది వాస్తవం. అపాయాన్ని చూడాలంటే మెదడు చాలా అప్రమత్తంగాను, సంపూర్ణమైన మెలకువలోను వుండాలి. అంటే సమస్తమైన మెదడు అలా వుండాలి. ఏదో ఒక భాగం మాత్రమే కాదు.

**ప్రశ్న:** సమస్తమైన మెదడును మెలకువగా వుంచడం ఎలా సాధ్యం అంటారు?

**కృష్ణమూర్తి :** నేను ముందే చెప్పినట్లుగా 'ఎలా' అనేది లేదు. అపాయాన్ని చూడటం మాత్రమే వుంటుంది. అదీ అసలు సంగతి. ఈ చూడటం సిద్ధాంత ప్రచారం వలనగాని, నిబద్ధీకరణం వలన గాని జరిగేది కాదు. ఈ చూడటం సమస్తమైన మెదడుతో చూడటం. మెదడు సంపూర్ణమైన మెలకువతో వున్నప్పుడు మనసు ప్రశాంతంగా వుంటుంది. మెదడు సమస్తం మేలుకొని వున్నప్పుడు విఛ్ఛిన్నత, అంటే ముక్కలు-ముక్కలుగా అవడం వుండదు. విడి విడిగా వేరుపడటం వుండదు. ద్వైతభావం వుండదు. ఇటువంటి నెమ్మదిలో ప్రశాంతతలో వున్న గుణం అత్యంత ప్రధానమైనది. మనసును మాదక ద్రవ్యాలతోను, రకరకాలైన తంత్రాలతోను ప్రశాంతపరచవచ్చును. కానీ అటువంటి వంచనలు అనేకమైన ఇతర భ్రమలకు, పరస్పరవైరుధ్యాలకు దారితీస్తాయి. ఈ ప్రశాంతత అత్యున్నతమైన తెలివితేటలను సూచిస్తుంది. ఈ తెలివి వ్యక్తిగతమైనదీ కాదు, కాకుండానూ వుండదు. అది మీదీ కాదు, నాదీ కాదు. అది అనామకమైనది. అందుచేత అది పూర్ణమైనది, సుస్వచ్ఛమైనది. అది అవర్ణనీయమైనది. ఎందుకంటే అది నిర్గుణమైనది. ఎరుక అంటే ఇదే. సావధానశీలత అంటే ఇదే. ఇదే ప్రేమ. శిఖరాగ్రాయ మానమైనది ఇదే. మెదడు పూర్తిగా మేలుకొని జాగరూకంగా వుండాలి అంతే. అరణ్యంలో నివసిస్తున్న మనిషి బ్రతికి వుండటానికి ఎంత విపరీతమైన మెలకువతో వుంటాడో, అలాగే ఈ లోకం అనే అరణ్యంలో వుంటున్న మనిషి కూడా జీవితాన్ని పరిపూర్ణతతో గడపడానికి అంతటి మెలకువతోనూ వుండాలి.

('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి; పుటలు 110-113)

## గాయపడటం లేకుండా బ్రతకడం సాధ్యమే

ఎందుకని బాల్యం నుండీ మానసికంగా గాయపడుతూ వస్తున్నాం మనం? - అనే ప్రశ్న వేసుకోవాలి. మనలో చాలామంది మానసికంగా గాయపడ్డారు. మనకా సంగతి తెలుసో తెలియదో. కాని ఆ గాయంలో నుండి మన సమస్యలు అనేకం పుట్టుకొస్తున్నాయి. చిన్నపిల్లవాడిని తిట్టినప్పుడు అతడు గాయపడతాడు. అసహ్యకరమైన వాటిని, చాలా క్రూరమైన వాటిని, హింసాత్మకమైన వాటిని చూసినా విన్నా కూడా చిన్నపిల్లలు గాయపడతారు. 'నేను గాయపడ్డాను' అని మీరు అంటుంటే అసలు ఆ గాయపడినది ఎవరు? గాయపడినది మీ గురించి మీరు నిర్మించుకున్న ఒక కల్పనా చిత్రమా, మనోతత్వమా? ఆ మనోతత్వమే ఈ 'నేను'. నేను అంటే నా గురించి నేను నిర్మించుకున్న ఒక కాల్పనిక చిత్రం. దీనిలో ఆధ్యాత్మికత ఏమీ లేదు. ఈ 'ఆధ్యాత్మికమైన' అనేది మహా వికృత పదం. సరే, ఆ కల్పనా చిత్రం గాయపడుతుంది. ఆ గాయపడిన బొమ్మను మన జీవితం పొడుగునా మోసుకొని పోతుంటాం. ఒక కాల్పనిక చిత్రం కనుక నంతోషకరంగా అనిపించకపోతే మరొక సౌఖ్యవంతమైన కల్పనా చిత్రాన్ని నిర్మించుకుంటాం. ఇదే లాభసాటిగా వుంటుందని, దీనికి కొంత ప్రత్యేకత వున్నదనీ, ఇది మన జీవితానికి ఒక మేధోన్నతిని కలిగిస్తుందనీ ఈ కల్పనా చిత్రానికి ప్రోత్సాహం ఇస్తాం.

ఎవరిని గురించి కానీ, ఏ ఒక్క కాల్పనిక చిత్రం కూడా లేకుండా ఈ భూమి మీద బ్రతకడం సాధ్యమా కాదా? దేవుడిని గురించి కూడా - అసలు అటువంటి సత్యం అంటూ ఒకటి వుంటే. మీ భార్యను గురించి కానీ, మీ పిల్లలను గురించి కానీ, మీ భర్తను గురించి కానీ - ఎవరిని గురించి అయినా సరే - కాల్పనిక చిత్రమే లేకుండా బ్రతకడం సాధ్యం కాదా? ఒక్క కాల్పనిక చిత్రమైనా లేకుండా? అప్పుడు ఇక ఎప్పటికీ గాయపడటం అనేదే లేకుండా వుండటం సాధ్యమవుతుంది.

(వాషింగ్‌టన్.డి.సి: 20 ఏప్రిల్ 1985)

# కాల్పనిక చిత్రాలను ఆలోచన తయారుచేసి ప్రదర్శించుకుంటుంది

ప్రతి మనిషీ ఇతరులను గురించి తన స్వంత కాల్పనిక చిత్రాన్ని ఒకటి నిర్మించుకుంటాడు. అతడికి తనను గురించి కూడా ఒక కాల్పనిక చిత్రం వుంటుంది. అంతే కాకుండా దైవాన్ని గురించి, తన ఇష్టదేవత గురించి కూడా అతడికి కల్పనా చిత్రాలు వుంటాయి. ఒక కాల్పనిక చిత్రాన్ని సృష్టించుకున్నప్పుడు మనిషికి ఆ కాల్పనిక చిత్రంలో ఒక భద్రత లభిస్తుంది. ఆ భద్రత బూటకమైనది అవచ్చు, అవాస్తవమైనది అవచ్చు. అది మతిహీనతా అవచ్చు. అయినా సరే, మనిషికి అందులో ఏదో భద్రత లభిస్తుంది. అందుకే ఈ కల్పనా చిత్రాలను నిర్మించుకుంటాడు. మనసు సృష్టించిన ఈ కాల్పనిక చిత్రాలలో అతడికి భద్రత వుంటుంది. మీ భార్యను గురించి మీరొక కాల్పనిక బింబాన్ని నిర్మించుకుంటే, లేదా మీ భార్య మీ గురించి ఒక కల్పనా చిత్రాన్ని నిర్మించుకుంటే ఆ కాల్పనిక చిత్రాలు నిజమైనవి కావు. నిజమైన వాటిలో జీవించడం చాలా కష్టం. మీరు కల్పించుకున్న ఊహా చిత్రాలతో జీవించడం అంతకంటే సులభంగా వుంటుంది.

కాబట్టి సంబంధ బాంధవ్యం వున్నదే ఈ కాల్పనిక చిత్రాల మధ్య. అందుచేత అసలు సంబంధ బాంధవ్యం లేనట్లే చెప్పవచ్చు. ఇది ఒక వాస్తవం. క్రైస్తవులు ఒక కాల్పనిక చిత్రాన్ని ఆరాధిస్తారు. శతాబ్దాల తరబడి మతాచార్యులు, భక్తులు ఈ కల్పనా చిత్రాన్ని నిర్మిస్తూవచ్చారు. 'నాకు ఉపశమనం కావాలి. నాకు భద్రత కావాలి. నా బాగోగులు కనిపెట్టి చూసే ఒకరు నాకు అవసరం. నేను చికాకుల్లో వున్నాను. నేను గందరగోళంలో వున్నాను. నాకు భద్రత లేదు' అని వారంటారు. కాల్పనిక చిత్రంలో వారికి భద్రత లభిస్తుంది. అందుకని మనం కాల్పనిక చిత్రాలను ఆరాధిస్తున్నాం. మనం సత్యాన్ని ఆరాధించడం లేదు. ధర్మయుతమైన జీవితాన్ని ఆరాధించడం లేదు. మనం కేవలం కల్పనలను ఆరాధిస్తున్నాం. ఒక దేశపు చిత్ర పటాన్ని, దానితో పాటుగా ఆ దేశపు జెండాను, ఒక శాస్త్రవేత్తను గురించో, ప్రభుత్వాన్ని గురించో మనకు గల కాల్పనిక చిత్రాలను మనం పూజిస్తాం, ఆరాధిస్తాం. మానవుడికి గల దోషాలలో ఒకటి ఈ కల్పనా చిత్రాల ఉత్పాదన. అందుచేత, దేనిని గురించి అయినా సరే, కల్పనా చిత్రం అనేదే లేకుండా వుండటం సాధ్యమవుతుందా? అంటే, వాస్తవాలతోనే జీవించడం. వాస్తవం అంటే నిజంగా జరుగుతున్నది ఏదో అది.

మనసు ఎందుకని ఈ కాల్పనిక బింబాలను తయారుచేసుకుంటుంది? జీవితం ఒక కల్పనా చిత్రం కాదు కదా? దురదృష్టవశాత్తు జీవితం మహా ఘర్షణ. జీవితం నిరంతర సంఘర్షణ. సంఘర్షణ కాల్పనిక చిత్రం కాదు. జరుగుతున్న సంగతి. వాస్తవం. మరి మనసు ఎందుకని కాల్పనిక చిత్రాలను తయారు చేసుకుంటుంది? కాల్పనిక చిత్రం అంటే ఈ వక్త అర్థం ఏమిటంటే - ఒక సంకేతము, ఒక చిహ్నము, ఒక ఊహ, ఒక అభిప్రాయము, ఒక ఆదర్శము అని. ఇవన్నీ కూడా కాల్పనిక చిత్రాలే. అంటే ' నేను ఇలా ఉండాలి. అనీ, 'నేను ఇది కాదు, కాని అలా ఇంకోలా ఉండాలి అని అనుకుంటున్నాను'. ఇది మనసు కాలంలో పెట్టి ప్రదర్శించుకుంటున్న ఒక కాల్పనిక చిత్రం. అంటే అది భవిష్యత్తులో అనమాట. అందుచేత అది అవాస్తవం. అందులో నిజం లేదు.

## మెదడుకు యాంత్రికంగా పనిచేయడం అలవరచబడింది

ఈ జీవి, మెదడును కలిగివున్న దేహము అనే ఈ పరికరము ఎప్పటికీ క్షీణించి పోకుండా వుండటం సాధ్యమా? మన వయసు పెరుగుతున్న కొద్దీ మెదడు క్షీణించి పోతూ వుంటుంది. ఇలా క్షీణించి పోకుండా మెదడు ఎప్పటికీ తారుణ్యంతో వుండగలదా? దేహ సంబంధితంగాను, మానసిక సంబంధితంగాను కూడా నిరంతరమైన రాపిడి, నిరంతరమైన ప్రయాస, నిరంతరమైన ప్రయత్నము వుంటే మెదడు తప్పక క్షీణించి పోతుంది. ప్రయత్న ప్రయాసలు లేని జీవన మార్గం ఏదైనా ఒకటి వున్నదా? అప్పుడే కదా మెదడు ఎప్పుడూ తారుణ్యంతో, సరిక్రొత్తగా, చురుకుగా, పదునుగా వుండగలుగుతుంది. ఇది సాధ్యమే. మనలో ప్రతి నిత్యమూ జరుగుతున్న నిరంతర పోరాటం గురించి మనకు తెలుసా? ఏదో ఫలానాగా అవాలని ప్రయత్నించడము, అనుకరించాలని ప్రయత్నించడము, కట్టుబడిపోయి వుండాలని ప్రయత్నించడము, ఆ దర్శాన్ని అందుకోవాలని ప్రయత్నించడము - ఇదంతా యాంత్రికమైన ప్రక్రియ కాదూ? ఈ సంగతి మీకు తెలుసా? ఇవన్నీ మీరు చేస్తున్నారనే స్పృహ మీకు వున్నదా? ఎలా దీనిని ఆపాలి అని ప్రశ్నించకండి. ప్రతిరోజూ ఒకే తీరులో జరుపుతున్న ఈ యాంత్రికమైన దినచర్యను ఎలా ఛేదించాలి అనే ప్రశ్న అడగవద్దు. దీని గురించి ఎరుకగా అవండి. ఇష్టాయిష్టాల ప్రసక్తి లేని ఎరుకతో వూరికే దీనిని పరికించండి. ఎందుకంటే ప్రయత్నాన్ని కనుక జొరబెట్టారంటే అంతా ధ్వంసమై పోతుంది. మెదడులోని ఈ యాంత్రికమైన చలనాన్ని అవును - కాదుల ప్రసక్తి లేకుండా పరిశీలించగలరా? నిజానికి మీరు పరిశీలిస్తున్నది మెదడులోని ఒక భాగాన్ని మాత్రమే. మెదడులోని ఈ కొంత భాగానికి శతాబ్దాలపై శతాబ్దాల తరబడి యాంత్రికంగా పనిచేయడం అలవరచబడింది. దీనిని గురించి వూరికే ఎరుకగా వుండండి. దీనిని సరిదిద్దాలని ప్రయత్నించకండి. దీనిని మార్చాలని చూడకండి. ఎందుకంటే, మార్పు చేయాలి అనే ప్రయత్నంలోనే సంఘర్షణ వస్తుంది. ఇంతకు ముందు నేను చెప్పినట్లుగా ద్వైతభావం ఎక్కడ వుంటుందో అక్కడ పరిశీలకునికి పరిశీలితానికి (పరిశీలించబడుతున్న దానికి) మధ్య భేదం వున్నప్పుడు అక్కడ సంఘర్షణ వుంటుంది. పరిశీలకుడు లేకుండా కేవలం పరిశీలన మాత్రమే వున్నప్పుడు అక్కడ సంఘర్షణ వుండదు.

**(ఒహాయి : 17 ఏప్రిల్ 1976)**

నిజం ఏమిటంటే ఇప్పుడు మీ మనస్సులో వాస్తవంగా ఏం జరుగుతున్నదో అది. సరే ఇక ముందుకు పోదామా?

అందుచేత నేను ప్రశ్నిస్తున్నది ఏమిటంటే, మనసు ఎందుకని ఒక కాల్పనిక చిత్రాన్ని తయారుచేసు-కుంటున్నది? ఆ కాల్పనిక చిత్రంలో భద్రత వున్నది కాబట్టా? నాకు కనుక భార్య వుంటే ఆమెను గురించి ఒక కల్పనా చిత్రాన్ని సృష్టించు-కుంటాను. అసలు భార్య అనే ఆ పదమే ఒక కల్పన. భార్య ఒక సజీవమైన సంగతి కాబట్టి, మార్పు చెందుతూ, జీవిస్తూ వున్న, ప్రాణశక్తితో వున్న ఒక మానవసత్వం కాబట్టి, అటువంటి ఆమెను అర్థంచేసు-కోవడానికి ఎంతో సావధానత, ఎంతో అమితమైన శక్తి వుండి తీరాలి. ఆమెను గురించి ఒక కాల్పనిక చిత్రం కనుక వుంటే, ఆ కాల్పనిక చిత్రంతో జీవించడం ఇంతకంటే సులువుగా వుంటుంది.

మీగురించి కూడా మీకో కాల్పనిక చిత్రం వున్నది కదూ - మీరు చాలా గొప్ప వారని, లేదా మీరు చాలా గొప్పమనిషి కాదనీ, మీరు ఇదనీ లేదా అదనీ, ఇంకా ఇటువంటివే ఏవేవో వున్నాయి కదూ? కల్పనా చిత్రాలతో జీవిస్తున్నప్పుడు మీరు భ్రమలలో జీవిస్తున్నారన్న మాట. యథార్థంతో కాదు. సరే, కాల్పనిక చిత్రాలను తయారు చేసే ఈ యంత్రాంగం ఏమిటి? వ్యవస్థీక-రించబడిన, ఆమోదించబడిన, గౌరవ మర్యాదలు ఆపాదించుకున్న మతాలు అన్నింటికీ ఏదో రకమైన కల్పనా చిత్రం వుంటుంది. మతాచార్యుల సహాయంతో మానవాళి చిరకాలంగా ఒక చిహ్నాన్నో, ఒక భావననో, ఒక ఊహనో, ఇంకా ఇటువంటి వాటినో ఆరాధిస్తూ వస్తున్నది. ఈ ఆరాధనలో మనిషి ఉపశమనము, రక్షణ, భద్రత పొందుతున్నాడు. అయితే, ఈ కాల్పనిక చిత్రాన్ని ఆలోచనే తయారుచేసి, పైకి ప్రదర్శిస్తున్నది. కాల్పనిక చిత్రాల తయారీని, దాని తీరుతెన్నులను అర్థం చేసుకోవడానికి ఆలోచనా ప్రక్రియను సమస్తమూ అవగాహన చేసుకోకతప్పదు.

('మేగ్నిట్యూడ్ ఆఫ్ ది మైండ్' నుండి)

## అంతర్గతమైన నిజమైన విప్లవం

నిజమైన విప్లవం అంతర్గతమైనది. మనసు దానిని వెంటాడకుండానే అది, ఆ విప్లవం ఉనికిలోకి వస్తుంది. ఎంత హేతుయుక్తంగా వున్నా సరే, ఎంత తర్కబద్ధంగా అనిపించినా సరే, ఎంత మేధోన్వితంగా తోచినా సరే మనసు వెంటాడి కనిపెట్టేది ఏదైనా సరే - అది చరమ సమాధానం ఎన్నటికీ అవదు. ఎందుకంటే, ఎన్నింటినో కల్పించి, చేర్చి మనసు కూర్చబడింది. మనసు సృష్టించేది ఏదైనా సరే అది కూడా ఇలాంటి కూర్పు వంటిదే. కాబట్టి, ఆ కూర్పును విడగొట్టివేయచ్చు. అయితే, నేను చెప్తున్న ఈ విప్లవం నిజమైన మతాత్మక జీవనం, ధర్మయుత జీవనం. ప్రపంచ మంతటా వున్న మతవ్యవస్థలు అన్నింటిలోను గల ఆ అర్థరహిత అసంబద్ధతలు ఏవీ దీనిలో అంటుకొని లేవు. అవన్నీ తీసి పారవేయ బడ్డాయి. మతాచార్యులతో కాని, చిహ్నాలతో కాని, చర్చిలతో కాని ఈ ధర్మయుత జీవనానికి ఏమాత్రం సంబంధం లేదు.

(బ్రసెల్స్, బెల్జియం; 25 జూన్ 1956)

## అంతర్గతమైన నిబద్ధీకరణం

సభ్యతా సంస్కృతుల ద్వారా, పరిసర వాతావరణం ద్వారా, జ్ఞానవిజ్ఞానాల ద్వారా మనసు నిబద్ధిత మవుతుంది. ఇదంతా కూడా కాలపు చలనం. ఆలోచన కూడా కాలపు కదలికే. కాబట్టి మనసును దాని నిబద్ధత నుండి ఆలోచన విడిపించలేదు. ఆలోచన మనసును పరివర్తింప చేయనూ లేదు. విశ్లేషణ ద్వారా ఇది సాధ్యం కానట్లే ఆలోచన ద్వారా కూడా ఇది సాధ్యం కాదు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే : ఈ నిబద్ధీకరణాన్ని మనసు, విద్యుక్తమైన ఈ సత్వం ఏ చలనమూ, ఏ కదలికా లేకుండా పరిశీలించ గలదా? ఇది కనుక మీరు చేస్తే అణచుకోవడము, అనుకరించడము, కట్టుబడి వుండటము అనేటటువంటివి సమస్తమూ పూర్తిగా అదృశ్యమైపోవడం మీరే చూస్తారు.

స్వేచ్ఛ - స్వాతంత్ర్యము అంటే నిబద్ధత నుండి విడుదల కాదు. స్వేచ్ఛ అంటే ఆలోచనల యొక్క కదలికలు లేకుండా నిబద్ధీకరణాన్ని చూడటం, నిబద్ధీకరణపు ఎరుక కలిగి వుండటం. ఆ సావధానతలో నుండి, ఆ ఎరుకలో నుండి విముక్తి ప్రాప్తిస్తుంది.

(సానెన్, స్విట్జర్లండ్; 19 జులై 1973)

Published in August, December, April
Registered with The Registrar of Newspapers
for India under No. TNTEL/2006/19442

PERIODICAL

If undelivered please return to:
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803 / 24937596
E-mail : publications@kfionline.org
Websites : www.kfionline.org / www.jkrishnamurti.org

Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road, Chennai - 600 028.
Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27, Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy